'పది'కి పటిష్ట ప్రణాళిక

- ఉజ్వల భవిష్యత్తుకు టెన్త్ మైలు రాయి
- విజయకేతనం స్ఫూర్తితో ప్రత్యేక విద్యాబోధన
- ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల కృషి



పూళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతుల్లో చదువుకుంటున్న టెన్త్ విద్యార్థులు

భీమడోలు: టెన్త్ విద్యార్థులు మెరుగైన విద్యా ప్రమాణాలతో ఉత్తమ మార్కులు సాధించాలన్న లక్ష్యంతో జిల్లా విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఉజ్వల భవిష్యత్తుకు మైలు రాయి వంటి పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలన్న లక్ష్యానికి అనుగుణంగా చదువులో వెనుకబడిన సీ, డీ గ్రేడుల విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. దీనితో ఆ విద్యార్థుల కోసం జిల్లా విద్యాశాఖాధికారి రవిసాగర్ పర్యవేక్షణలో సబ్జెక్ట్ నిపుణుల పర్యవేక్షణలో డీసీఈబీ విజయకేతనం పుస్తకాన్ని తయారు చేసి ఆ తరహాలో పగడ్బందీగా విద్యాబోధనను అమలు చేస్తోంది. విజయకేతనం స్ఫూర్తితో లాంగ్ టైం టేబుల్ అమలు చేస్తూ విద్యార్థులను సబ్జెక్టుల వారీగా సంసిద్ధులను చేస్తున్నారు. గత పబ్లిక్ పరీక్షల్లో వచ్చిన ముఖ్యమైన ప్రశ్నలు, వాటి జవాబులను విద్యార్థులకు తెలిపి చదివిస్తున్నారు. విద్యార్థులకు ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5 గంటలకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. పునరుశ్చరణ తరగతులు, రోజు వారీ పరీక్షలు, సమీక్ష తరగతులు, స్టడీ అవర్స్, విద్యార్థులను దత్తత, ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. ఎప్పటికప్పుడు చిన్నారుల అనుమానాలను నివృత్తి చేస్తున్నారు. ఉపాధ్యాయుల తోడ్పాటుతో విద్యార్థులు సాధన చేస్తున్నారు. ఈనెల 9 నుంచి 18వ తేదీ వరకు ప్రీ పబ్లిక్ పరీక్షలు నిర్వస్తున్నారు.

కోవిడ్ మహమ్మారి వల్ల విద్యపై ప్రభావం

కోవిడ్ విజృంభణ ప్రభావం విద్యార్థుల చదువులపై పడింది. రెండేళ్లు కోవిడ్ కారణంగా తరగతులు సక్రమంగా నిర్వహించకపోవడంతో ప్రస్తుతం పదో తరగతిలోకి వచ్చిన విద్యార్థులు కీలక సబ్జెక్టులలో తడబడుతున్నారు. ఈ మేరకు గతేడాది పదో తరగతి పరీక్షల్లో ఫలితాలు నిరాశాజనకంగా మారాయి. ఈ ఏడాది నిర్వహించిన ఆయా పరీక్షల్లో విద్యార్థులు ఏ సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నారో లోపాలను గుర్తించి వాటిని సరిదిద్దే చర్యలు విద్యాశాఖ చేపట్టింది. సీ, డీ గ్రేడు విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఈ ఏడాది నియోజకవర్గంలోని భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం మండలాల్లోని 45 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 2,289 మంది వచ్చే నెల 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలు రాయనున్నారు.

మండలం	పాఠశాలల సంఖ్య	విద్యార్థులు
భీమడోలు	10	438
ఉంగుటూరు	13	750
నిడమర్రు	10	359
గణపవరం	12	742

ఏడాది నుంచి టెన్త్‌లో ఆరు పేపర్లు

రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది పదో తరగతి పరీక్షలను సీబీఎస్ఈ విధానంలో అమలు చేయాలని నిర్ణయించింది. ఈ ఏడాది ఆరు సబ్జెక్టులకు ఆరు పేపర్లలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లీషు, గణితం, సైన్సు, సోషల్ సబ్జెక్టులున్నాయి. ఈ ఏడాది ఫిజికల్, బయాలాజికల్ సబ్జెక్టులను ఒకే పేపర్‌గా పరీక్ష నిర్వహిస్తారు. ఏప్రిల్ 3వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహించనున్నారు.

స్టడీ అవర్స్‌తో చాలా ప్రయోజనం



స్టడీ అవర్స్ ఎంతగానో ప్రయోజనకరంగా ఉన్నాయి. స్టడీ అవర్స్‌లో చదువుతుండగా సమయంలో వచ్చే సబ్జెక్టు పరమైన అనుమానాలను ఉపాధ్యాయులను అడిగి వాటిని నివృత్తి చేసుకుంటున్నాం. దీనితో పాఠ్యాంశాలపై పూర్తి అవగాహన ఏర్పడుతోంది.

– కె.హేమదీప్, పదో తరగతి విద్యార్థి, భీమడోలు

గ్రేడుల వారీగా విద్యార్థులను విభజించి శిక్షణ



విద్యార్థులను ఏ, బీ ,సీ,డీ గ్రేడులుగా విభజించి చదివిస్తున్నాం. ఏ గ్రేడు విద్యార్థులు ఎక్కువ మార్కులు సాధించేలా తర్ఫీదునిస్తున్నాం. పాఠశాలలో 50 శాతానికి పైగా సీ, బీ గ్రేడుల విద్యార్థులున్నందున వారిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. ఫిజికల్ సైన్సు పాఠ్యాంశాలపై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నాను.

– జే.అనిల్‌కుమార్, ఫిజికల్ సైన్సు టీచర్, భీమడోలు

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



గతేడాది పబ్లిక్ పరీక్షల్లో ఎక్కువగా గణితం, సైన్సు, సోషల్ సబ్జెక్ట్‌ల్లో ఫెయిల్ అవడంతొ ఆ సబ్జెక్టుల్లో చిన్నారులకు ప్రత్యేక తర్ఫీదును అందిస్తున్నాం. కలెక్టర్, డీఈవో ఆదేశాల మేరకు 40 రోజులు కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నాం. తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ఉపాధ్యాయులు వెనుకబడిన విద్యార్థులను దత్తత తీసుకుని బోధిస్తున్నారు.

– టి.పుష్పావతి, హెచ్‌ఎం, భీమడోలు

నూరుశాతం ఫలితాలు సాధించేలా కృషి



పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఫలితాలు సాధించేలా కృషి చేస్తున్నాం. సీ, డీ గ్రేడు విద్యార్థుల కోసం విజయకేతనం మెటీరియల్‌ను ప్రతి పాఠశాలకు పంపిణీ చేశాం. ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు అందిస్తున్న బోధన అమలు, సాధనలను పరిశీలిస్తున్నాం. పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నాం.

– డి.సాంబశివరావు, ఎంఈవో, భీమడోలు

క్లుప్తంగా

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ



భీమడోలులో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఎన్‌వీడీ ప్రసాద్ తదితరులు

భీమడోలు: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతుల వ్యతిరేక నిర్ణయాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ కోరారు. భీమడోలులోని సీఐటీయూ కార్యాలయంలో శనివారం రైతు, కౌలు రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చలో ఢిల్లీ జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కట్టా భాస్కరరావు, కౌలు రైతు సంఘం నాయకులు వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, జిల్లా నాయకులు జి.ప్రసాదరావు, సీఐటీయు మండల అధ్యక్షురాలు స్వర్ణకుమారి పాల్గొన్నారు.

వైభవంగా రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ



నూతన రామాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి : మండలంలోని న్యాయంపల్లిలో నూతనంగా నిర్మించిన రామాలయంలో దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన పూజలను శనివారం వైభవంగా నిర్వహించారు. అభిషేకాలు, అర్చనలు, హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, నాయకులు ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామి వార్లను దర్శించుకున్నారు. అనంతరం అన్నసమారాధనలో పాల్గొన్నారు. ఎంపీపీ తాతా రమ్య, సర్పంచ్ తూముల రాజు, సీతాల దాసు, మెట్లపల్లి సూరిబాబు, పెనుమాక వెంకట సుబ్బారావు, పలు గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపు

దెందులూరు: ఎమ్మెల్సీ ఎన్నికలు కోడ్‌లో అమలులో భాగంగా శనివారం దెందులూరు తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య మండలంలో అన్ని గ్రామ శివారు ప్రాంతాల్లో పర్యటించారు. గోపన్నపాలెంలోని రాజకీయ ఫ్లెక్సీలు, గ్రామ పంచాయతీ, రెవెన్యూ సిబ్బందితో తొలగించారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు అన్ని గ్రామాల్లో గ్రామ పంచాయతీ, రెవెన్యూ శాఖ సిబ్బంది ప్రతి రోజూ పర్యవేక్షణ చేసి రాజకీయ పార్టీ ఫ్లెక్సీలు ఉంటే వెంటనే తొలగించాలని తహసీల్దార్ ఆదేశించారు. ఆయన వెంట వీఆర్వో రామారావు ఉన్నారు.

రామదండు జెండాల పంపిణీ

దెందులూరు: ఉగాది పర్వదినం రోజున దేవదేవరుల శోభాయాత్ర నిర్వహణ కోసం శనివారం దెందులూరులో రామదండు సభ్యులు 4 వేల జెండాలను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఉగాది రోజున శోభాయాత్ర నిర్వహిస్తామని, భక్తులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వాహనాల తనిఖీ

గణపవరం: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గణపవరం సర్కిల్ పరిధిలో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. గణపవరం, పిప్పర, నిడమర్రు ప్రాంతాల వద్ద సీఐ ఎంవీ సుభాష్, ఎస్సై వి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు, స్పెషల్ స్క్వాడ్ సిబ్బంది వాహనాలను తనిఖీ చేస్తున్నారు. వాహనాల్లో డబ్బు, మద్యం, బహుమతులు వంటివి తరలిస్తున్నారేమోనన్న అనుమానంతో తనిఖీ చేస్తున్నారు.

నేడు వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం

పెదపాడు: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం పెదపాడు మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం నిర్వహిస్తున్నట్లు పెదపాడు మండల కన్వీనర్ అప్పన కనకదుర్గా ప్రసాద్ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఆయా గ్రామాల నాయకులు ఆధ్వర్యంలో జరుగుతున్నట్లు చెప్పారు. విధిగా అన్ని గ్రామాల్లో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొనాలని ఆయన చెప్పారు. పెదపాడులో ఉదయం 10 గంటలకు నిర్వహించే ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమంలో దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పాల్గొంటారని చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు కార్యకర్తలు పాల్గొనాలని ప్రసాద్ కోరారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలతో వ్యవసాయ సంక్షోభం

దెందులూరు: కేంద్ర ప్రభుత్వ విధానాలతో రైతుల వ్యవసాయం సంక్షోభంలో ఉందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే.శ్రీనివాస్ విమర్శించారు. శనివారం మండలంలోని ఉండ్రాజవరంలో ఆంజనేయస్వామి గుడి ఆవరణలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు, కౌలు రైతుల సమావేశం మండల అధ్యక్షుడు సున్నా వెంకట్రావు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో కే. శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు కష్టపడి పండించిన పంటలు అమ్ముకోలేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్‌లో ధాన్యం సేకరణకు నిధులు కోత పెట్టడం వల్ల భవిష్యత్తులో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసే పరిస్థితి ఉండదన్నారు. ఇప్పటికే ధాన్యం కొనుగోళ్లలో రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో కొల్లి విజయభాస్కరరెడ్డి, పీ. రవికుమార్, కడగళ్ల దుర్గారావు, కంటిబోతు శ్రీనివాసరావు, కడగళ్ల సూర్యనారాయణ, సున్నా సాయి ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే సీఎం జగనన్న ఊపిరి



గుండుగొలనులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుబాబు



హాజరైన గృహసారథులు, కన్వీనర్లు, పార్టీ నాయకులు

భీమడోలు: అభివృద్ధి, సంక్షేమమే ఊపిరిగా దేశంలో ఎక్కడా లేని విధంగా పేదలందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి గుండెలో కొలువై ఉన్నాడని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. గుండుగొలనులోని వైసీపీ గ్రామ పార్టీ కార్యాలయం వద్ద శనివారం గుండుగొలను, కోరుకల్లు, లక్ష్మీపురం గ్రామాల్లోని గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ పార్టీ అధ్యక్షుడు ముదుండి సూర్యనారాయణరాజు అధ్యక్షతన వహించగా ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వాసుబాబు మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంపై వారికి దిశానిర్దేశం చేసారు. దేశంలో మొట్టమొదటిగా రాష్ట్రంలో ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలను చేరవేసే వ్యవస్థకు శ్రీకారం చుట్టి దిగ్విజయంగా అమలు చేస్తున్న ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. వలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు ఏ విధంగా అయితే సేవలందిస్తున్నారో గృహ సారథులు పార్టీకి ప్రజలకు మధ్య వారధులుగా పని చేయాలన్నారు. రానున్న రోజుల్లో వలంటీర్లు, గృహ సారథులు విధిగా ప్రతి కుటుంబాన్ని సందర్శించాలని, ప్రభుత్వం, పార్టీల పట్ల వారి అభిప్రాయాలను తెలుసుకోవాలన్నారు. స్థానికంగా గుర్తించిన సమస్యలను ఈ గృహ సారథులు, మండల సచివాలయాల కన్వీనర్ల ద్వారా మండల కన్వీనర్లు, రాష్ట్ర కన్వీనర్లకు చేరుకుంటుందన్నారు. క్షేత్ర స్థాయిలోని సమస్యలన్నింటినీ పరిష్కరించే అవకాశం ఈ వ్యవస్థకు ఉంటుందన్నారు. గృహసారథులు, కన్వీనర్లు పార్టీలో కీలక కానున్నారని, వారికి పార్టీ ఉచిత బీమా సౌకర్యాన్ని కల్పిస్తుందని, పార్టీ కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానం, ప్రాధాన్యత ఇస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చేలా యుద్ధ సైనికుల్లా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు ముదుండి సూర్యనారాయణరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి చిలువూరి సత్యనారాయణరాజు, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమజూనియర్, వైస్ ఎంపీపీ దోకల వాసంతి, మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, ఎంపీటీసీలు నత్తా నాగిని, నాగనబోయిన వెంకటేశ్వరరావు, సచివాలయాల మండల కన్వీనర్ మద్దుల రాజా, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రావెల్ బస్సును ఢీకొట్టిన లారీ

భీమడోలు: జాతీయ రహదారి కురెళ్లగూడెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో పలువురు ప్రయాణికులు స్వల్ప గాయాలతో సురక్షితంగా బయట పడ్డారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. యానాం నుంచి హైదరాబాద్ వెళుతున్న ప్రైవేటు ట్రావెల్ బస్సు మార్గమధ్యమైన కురెళ్లగూడెం వద్దకు వచ్చేసరికి ముందుగా వెళ్తున్న లారీ యూటర్న్ తీసుకోవడంతో ఈప్రమాదం జరిగింది. అతివేగంగా వస్తున్న ట్రావెల్ బస్సును లారీని స్వల్పంగా ఢీకొట్టింది. దీనితో ఒక్కసారిగా బస్ అదుపు తప్పి పక్కనే ఉన్న రోడ్డు మార్జిన్‌లోకి దూసుకెళ్లింది. బస్సులోని ప్రయాణికులు స్వల్పగాయాలతో బయట పడ్డారు. పెను ప్రమాదం నుంచి తప్పించుకోవడంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. భీమడోలు పోలీసులు విచారిస్తున్నారు.

హామీలన్నీ నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్



ఆగడాలలంకలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి జయమంగళ వెంకటరమణ

భీమడోలు: ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. ఆగడాలలంక పంచాయతీ ప్రాంగణం వద్ద శనివారం రాత్రి ఆగడాలలంక, చెట్టున్నపాడు, మల్లవరం గ్రామాల గృహ సారథులు, కన్వీనర్లు ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. తొలుత గ్రామంలో నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే వాసుబాబు, ఎమ్మెల్సీ అభ్యర్థి జయమంగళ వెంకటరమణకు పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ మహిళా సాధికారతే లక్ష్యంగా మహిళలను అన్ని రంగాల్లో రాణించేలా పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి జయమంగళ వెంకటరమణ మాట్లాడుతూ కొల్లేరు అభయారణ్యంలో ప్రభుత్వ భూమి ఉందని, వాటిని డ్రోన్ సర్వే చేసి పేదలకు పంచాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరినట్టు తెలిపారు. కొల్లేరు వాసులకు అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ సైదు గాయత్రి సంతోషిణి, ఎంపీపీ కనమాల రామయ్య, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగా, కార్పొరేషన్ డైరెక్టర్ భలే నాగలక్ష్మి, ఆగడాలలంక, చెట్టున్నపాడు సర్పంచులు భలే రాంబాబు, జల్లూరి వెంకటరమణ, ఏఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమజూనియర్, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు గోలి సుబ్బారావు, మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, సచివాలయాల మండల కన్వీనర్ మద్దుల రాజా, ఎంపీటీసీ ఒనమాల సుజాత, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, పార్టీ అధ్యక్షుడు సైదు గోపాలకృష్ణ, నాయకులు మేడిశెట్టి వెంకట్, కుచ్చెర్ల శాంతరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైరల్ జ్వర బాధితులకు ప్రత్యేక వైద్య పరీక్షలు



కాశిపాడులో ఇంటింటా ఫీవర్ సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం: ఎవరికైనా జ్వరం, దగ్గు లక్షణాలతో హెచ్ 3, ఎన్ 2 ఇన్ ఫ్లూయెంజా కనిపిస్తే వారికి పీహెచ్‌సీలో ప్రత్యేక ఓపి ఏర్పాటుచేసి, చికిత్స అందిస్తున్నట్లు వైద్య గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి సంతోష్ నాయుడు తెలిపారు. శనివారం గణపవరం, పిప్పర పీహెచ్‌సీల పరిధిలోని గణపవరం, సరిపల్లె, కాశిపాడు, చిలకంపాడులో ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించారు. రోజూ ఒక్కో గ్రామంలో ఫీవర్ సర్వే నిర్వహించి మధ్యాహ్నానికి పీహెచ్‌సీలో రిపోర్టు ఇవ్వాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్న ఫ్లూ జ్వరాలు (ఇన్‌ఫ్లూయెంజా) నివారణకు పీహెచ్‌సీలో తగిన చికిత్స, మందులు సిద్ధంగా అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రస్తుత వాతావరణ మార్పు కారణంగా వైరల్ జ్వరాలు ఎక్కువగా ఉన్నాయని, జ్వరం, దగ్గు, ముక్కు కారడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే పీహెచ్‌సీలో సంప్రదించాలని సూచించారు. ఇవి కరోనా లక్షణాలను పోలి ఉండటం వల్ల ప్రజలు భయపడుతున్నారని అందువల్ల ప్రజలకు తమ సిబ్బంది ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ తప్పనిసరిగా మాస్క్ ధరించాలని సూచించారు. ఈకార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు డిరామారావు, స్రవంతి, ఆరోగ్య సహాయకుడు నామాలరాజు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

16 నుంచి సాయి మందిర వార్షికోత్సవం



రాట్నాలకుంటలోని సాయి మందిరం

పెదవేగి: ఈనెల 16 నుంచి సాయి మందిర 19వ వార్షికోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వర్తిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పెద వేగి మండలం రాట్నాలకుంటలో వెలసిన కొఠారు అబ్బయ్య మెమోరియల్ షిర్డిసాయి చారిటబుల్ ట్రస్ట్ 19వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు చావలి సత్యనారాయణమూర్తి చెప్పారు. గురువారం 16వ తేదీ ఉదయం 5.15 గంటలకు కాకడా హారతి, ఉదయం 7:30 గంటలకు ఆలయ ప్రాంగణంలోని వినాయకస్వామి, ఆంజనేయస్వామి, దత్తాత్రేయస్వామి వార్లకు అభిషేకాలు, 9 గంటలకు బాబా వారిని రాట్నాలకుంట, కొండలరావుపాలెం, రాయన్నపాలెం, పాతూరు, కొత్తూరు, గొల్లగూడెంలో ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి, అయ్యప్పస్వామి, షిర్డిసాయి, నాగేంద్రస్వామికు అభిషేకాలు నిర్వహిస్తామన్నారు.

7,066 ఎకరాల్లో డ్రోన్ సర్వే



డ్రోన్ సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ నాంచారయ్య, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ల్యాండ్ సర్వే రమణ

దెందులూరు: డ్రోన్‌తో చిత్రీకరణ రీసర్వేలో భాగంగా దెందులూరు మండలంలో శనివారం 7,066 ఎకరాల్లో రీసర్వే చేస్తున్నట్లు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ల్యాండ్ సర్వే రమణ, దెందులూరు తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య అన్నారు. రీ సర్వేలో భాగంగా శింగవరం, కొమిరేపల్లి, కొత్తగూడెం, శ్రీరామవరం, ముప్పవరంలో డ్రోన్‌తో 28.61 స్క్వేర్ కిలోమీటర్లు చిత్రీకరణ చేశారు. షెడ్యూల్ ప్రకారం మిగిలిన గ్రామాల్లో చిత్రీకరణ కొనసాగుతుందని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ల్యాండ్ సర్వే రమణ అన్నారు. దెందులూరు సర్వేయర్ రమణ, వీఆర్ఓ చంద్రం, కార్యదర్శి వీఎస్ చౌదరి, వీఆర్ఏలు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

పెదపాడు: కలపర్రు టోల్‌గేట్ ప్రాంతంలో పెదపాడు పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు మద్యం, నగదు, ఇతర వస్తువులు రవాణా నిరోధానికి ఈ తనిఖీలు చేపట్టామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా బిల్లులు లేకుండా, ఏవిధమైన ఆధారాలు లేకుండా అధిక మొత్తంలో నగదు రవాణా చేస్తే సీజ్ చేస్తామని నాగబాబు చెప్పారు.

నేడు పూళ్లలో గృహ సారథులు, కన్వీనర్ల ఆత్మీయ సమావేశం

భీమడోలు: పూళ్లలోని కల్యాణ మండపం వద్ద ఈనెల 12న ఆదివారం ఉదయం 10 గంటలకు సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్ల ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు భీమడోలు వైసీపీ మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు శనివారం రాత్రి తెలిపారు. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఆధ్వర్యం వహిస్తారని తెలిపారు. పూళ్ల, ఎంఎంపురం, కోడూరుపాడు, దుద్దేపూడిలోని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు హాజరు కావాలని కోరారు.



